క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



విద్యార్థినిలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమే కాకుండా అనేక దుష్ప్రయోజనాలకు కారణమవుతాయని సమగ్ర శిశు అభివృద్ధి అధికారిణి వాణి తెలిపారు. శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవ ప్రాధాన్యతను తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సునీత మాట్లాడుతూ చైల్డ్ లైన్ అందిస్తున్న సేవలు, బాలల న్యాయ చట్టం, బాలికలకు విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాబుచాన్, సరిత, కళాశాల ప్రిన్సిపల్ రత్న ప్రభ, ఉపాధ్యాయురాలు విజయ కుమారి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా లో నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్ ను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా లో రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడం లో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. ఆ కారణంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఫిట్నెస్ సరిగ్గా లేకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బ్రేక్ ఫెయిల్ అయిన సంఘటన చూశామన్నారు. అయితే ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదని అన్నారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఘన సన్మానం



కోట మృత్యుంజయరావును సన్మానిస్తున్న బాలోత్సవ కమిటీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విద్యాలయ లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం అథారిటీ పర్యాటక రంగ ఎక్సలెన్స్ అవార్డు ప్రకటించినందుకు కడప బాలోత్సవం నెలవారి సమావేశంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలోత్సవం జిల్లా అధ్యక్షులు గుర్రాల గోపాల్ మాట్లాడుతూ డా. కోట మృత్యుంజయరావు ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు మీద , ఆలయ శిల్పాలు, కుడ్య చిత్రాలు, హస్త కళలు వాటి విశిష్టత మీద రాసిన పరిశోధన పత్రాలు , టూరిజం అభివృద్ధికి చేసిన కృషికి గాను ఈ అవార్డు వచ్చిందన్నారు. బాలోత్సవ ప్రతినిధి పాముని రెడ్డి , ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ నవంబర్ 29, 30 తారీఖులలో జరిగే బాలోత్సవం జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్సోవం ప్రతనిధులు వెంకటయ్య, సరోజ, సావిత్రి, రామసుబ్బమ్మ, సరస్వతి, మాలతి దత్త, ఎల్లేశ్వరరావు, వెంకటేశ్వరచారి, పాలెం మహేష్ బాబు హాజరయ్యారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుల నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామి వార్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కమలాపురం నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులురెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అర్చకులు, నిర్వాహకులు వారిని సన్మానించారు.

బస్టాండులో భయం.. భయం..







కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో పై పెచ్చులు ఊడి ప్రయాణికులు కూర్చునే ప్రాంతంలో పడుతుండడంతో ప్రయాణికులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో భయంతో కూర్చొని ఉండవలసిన పరిస్థితి దాపురించింది. దీంతో పేరుకే ఆర్టీసీ బస్టాండ్ ఉంది కానీ ప్రయాణికుల బాగోగులు పటించుకునే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని, మెరుగైన వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

బాలికల సంరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జీసిడిఓ ఆరోగ్యమేరీ

కడప ఎడ్యుకేషన్: బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు నడుంబిగించాలని సమగ్రశిక్ష జీసీడీఓ దార్త రూతు ఆరోగ్యమేరీ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని శంకరాపురంలో గల ప్రభుత్వ బాలికల వసతిగృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీడీఓ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. బాలికల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. బాలికలు, యువతులు వారి వారి రంగాలలో ప్రచారం పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ ఎం శ్రీలత, కౌన్సిలర్ డాక్టర్ బి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

బడులు, గుడుల వద్ద పెట్టిన వైన్ షాపులు రద్దు చేయాలి

కడప కార్పొరేషన్: కడపలో బడి, గుడుల వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాపులను రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కార్నర్ మీటింగుల్లో ఎమ్మెల్యే మాధవి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని నైతికత నిరూపించుకోవాలన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపలో ఎమ్మెల్యే మాధవి మద్యం షాపులు, బార్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదారు వైన్ షాపులు మాత్రమే ఉండగా, ఇప్పుడు 25 మద్యం షాపులు ఏర్పాటు చేశారని, ఇవిగాక పది బార్లు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.9 కోట్లు ఖర్చు చేసి రాజీవ్ మార్గ్‌ను



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

, రాజీవ్ పార్కును అభివృద్ధి చేసిందన్నారు. ఆహ్లాదకర ఈ మార్గంలో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుంటారని, ఇక్కడ లేడీస్ హాస్టళ్లు, పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇలాంటి చోట ఈ ప్రభుత్వం వైన్ షాపు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. నిరుపయోగంగా ఉన్న స్కూల్ భవనంలో తాను మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరకు నీటిని అందిస్తుంటే ఓర్వలేక ఖాళీ చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు రెండు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే చేర్చిందని, కూటమి ప్రభుత్వం ప్రతి డివిజన్‌లో ఒక వైన్‌షాపు, ఒక బార్ ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం జోనల్ అధ్యక్షుడు అఖిలేష్, యువజన విభాగం జిల్లా కార్యదర్శి ఫజల్, నగర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమాన్ని మరిచిన కూటమి ప్రభుత్వం

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకారంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి సంక్షేమాన్ని మరిచిందని బహుజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున పేర్కొన్నారు. శనివారం కడపలోని బహుజన టీచర్స్ యూనియన్ (బి టి యు ఏ పి) సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని మరచి పోయి ప్రవర్తిస్తోందని, ఇది దురదృష్టకరమన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టలేదన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్ ఉన్నాయని, పీఆర్సీకి సంబంధించి కమిటీ వేయలేదని, ఐ. ఆర్ ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ బాబు మాట్లాడుతూ ఆర్థిక అంశాలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించడం మంచిది కాదని అన్నారు. పాలకులు తమంతట తాము పాలన బాగుందని అనుకోకూడదని, ఉద్యోగులలో ఉన్న తీవ్ర నిరాశ, బాధను గమనించాలని అన్నారు. శాసనమండలిలో గౌరవ శాసనమండలి సభ్యులు ఉద్యోగులకు రావలసిన ఐ ఆర్ గురించి పెండింగ్‌లో ఉన్న డీఏ ల గురించి పీఆర్సీ గురించి ఎన్నోసార్లు ప్రస్తావించినప్పటికీ, అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్లు విన్నవించుకున్నప్పటికీ, ధర్నాలు చేసినప్పటికీ కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమని అన్నారు. ఉద్యోగులను ఇంత చిన్నచూపు చూడడం కేవలం అవమానించడమేనని అన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యమ్. గంగరాజు, కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున

సామాజిక సమస్యలపై అవగాహన అవసరం



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్, వాలంటీర్లు

కడప ఎడ్యుకేషన్: సామాజిక సమస్యలపై అవగాహన అవసరమని వైవీయూఎన్ఎస్ఎస్ యూనిట్-4, 7 ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్. సునీత, డాక్టర్ కె. లలిత అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సునీత ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లి గ్రామంలో శనివారం 'ఎయిడ్స్ నిర్మూలన' పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె. లలిత, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ యూనిట్-7 నేతృత్వంలో మిట్టమీదపల్లి గ్రామంలో మొక్కల నాటి నీరు పోశారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

కడప అగ్రికల్చర్: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన, పప్పుధాన్యాల ఆత్మ నిర్భరత మిషన్ ప్రారంభోత్సవ ప్రత్యక్ష వీక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ పద్ధతి ద్వారా దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ, కంది, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి పంటలను విస్తారంగా సాగు చేసేవారని ప్రస్తుతం విస్తీర్ణం చాలా తగ్గిందని, ఈ పంటల సాగు విస్తీర్ణం జిల్లాలో పెంచడానికి కృషి చేయాలన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం లక్ష్యం వివరించారు. కేవీకే కీటక ప్రధాన శాస్త్రవేత్త సునీల్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఏపీ సీడ్స్ మేనేజర్ సంపత్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ పథక ఉప సంచాలకులు వసంతకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, మానస, సురేష్‌కుమార్ రెడ్డి, గిరీష్ కుమార్, వివిధ డివిజన్ల ఏడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

విద్య వైద్యం ప్రైవేట్ పరం చేస్తే సహించం



కమలాపురంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లు విడుదల చేస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పీపీపీ విధానం పట్ల శ్రద్ధ చూపుతోందని, విద్య, వైద్యాన్ని ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని, ప్రజలతో కలసి పోటెత్తుతామని కమలాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ఉద్యమం పోస్టర్లు ఆయన అన్ని మండలాల నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి విద్య, వైద్యంను ప్రైవేట్ పరం చేస్తోందని దీంతో ప్రజలు ఇళ్లు, వాకిళ్లు అమ్ముకోవాల్సిందేనని, పీపీపీ విధానాన్ని సహించేదిలేదని, ప్రజలతో కలసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జగనన్న హయాంలో వచ్చిన 17 మెడికల్ కళాశాలల్లో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారన్నారు. ఎన్నికల కంటే ముందే ఈ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వారికి అప్పజెబుతానని వారికి హామీ ఇచ్చి ఉంటారన్నారు.

కడప నగర శివార్లలో 'స్టాప్- వాష్ అండ్ గో'

కడప అర్బన్: తెల్లవారుజామున నిద్ర మత్తులో జరిగే రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలనే సంకల్పంతో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ జిల్లాలోని జాతీయ రహదారులపై 'స్టాప్, వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కడప ట్రాఫిక్ ఎస్సై జయరాములు పర్యవేక్షణలో పోలీసులు నగరంలోని చెన్నై-కర్నూల్ నేషనల్ హైవే పైన, వై.ఎస్.ఆర్ సర్కిల్ వద్ద అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు 'స్టాప్- ఫేస్ వాష్ అండ్ గో ' కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై వెళ్తున్న కార్లు, లారీలు, బస్సులు, వ్యాన్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు. నిద్ర మత్తు నుండీ తేరుకునేలా ఫేష్ వాష్ తో పాటు కొంచెం టీ కూడా తాగమని పోలీసులు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యతగా గుర్తించి రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.



డ్రైవర్‌లకు 'స్టాఫ్- ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

చట్టసభల్లో బీసీల వాటాల కోసం పోరాటం



బీసీ రాజకీయ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఓబులేసు యాదవ్ తదితరులు

కడప రూరల్: చట్టసభల్లో బీసీల దామాషా ప్రకారం వాటా కోసం పోరాడుదాం అని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేష్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 8వ తేదీన నిర్వహించే రాజకీయ రాష్ట్ర మహాసభలు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 78 ఏళ్లుగా బీసీ వర్గాలు మోసాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ బీసీ వర్గాలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జనతాదళ్ పార్టీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, బీసీ మహాసభ నేత పెంచలయ్య, బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు వంశీ యాదవ్, ప్రధాన కార్యదర్శి లంబోదర, శివ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలి

కడప అర్బన్: పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం ఈ కార్యక్రమాలు జరిగాయి. పోలీస్ అధికారులు మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.

- మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు.
- వేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.
- మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని పోలీసులు కోరారు.



వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టపాసుల అంగళ్లకు చలానా చెల్లించాలి

కడప కార్పొరేషన్: దీపావళి పండుగ సందర్భంగా కడప నగరపాలక సంస్థ పరిధిలో టపాసుల అంగళ్లు ఏర్పాటు చేయాలనుకున్న విక్రయదారులు ఈనెల 14వ తేది సాయంత్రం 5 గంటల్లోపు రూ.10వేలు చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు మాత్రమే లాటరీలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఇతర శాఖలకు సంబంధించిన రుసుములు, అనుమతి పత్రాలు తప్పనిసరిగా పొందాలన్నారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో పని చేస్తున్న వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రెవిన్యూ కార్యాలయంలో వీఆర్‌ఏల జిల్లా సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని పెద్దముడియం ,జమ్మలమడుగు ,కొండాపురం ,ముద్దనూరు, రాజుపాలెం మండలాల పరిధిలోని వీఆర్‌ఏలకు సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈనెల 15న విజయవాడలో జరిగే వీఆర్‌ఏల ఆందోళన జయప్రదం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామ సేవకులకు గత ఎనిమిది సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు . తాత ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్న గ్రామ సేవకులకు తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, జిల్లా నాయకులు మద్దెల రవి, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, ప్రతాప్, ప్రసాదు, మహ్మద్ బాషా, సుబ్బరాయుడు , డివిజన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధాని మోడీ పాలనలో విభజన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రానికి రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సీమకు ఏమీ చేయని ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలుకు ఏ ముఖం పెట్టుకొని వస్తాడని ఆయన విమర్శించారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్ర మాట్లాడుతూ ఈనెల 16న జీఎస్టీ ఉత్సవ కార్యక్రమానికి హాజరవుతున్న నరేంద్ర మోడీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ ఆర్థిక లోటు భర్తీ, పోలవరం పూర్తి వంటి అంశాలను పూర్తిగా పక్కన పెట్టడమే కాకుండా కర్ణాటక, తెలంగాణ ఎన్నికల లబ్ధి కోసం ఎలాంటి అనుమతులు కేటాయింపులు లేని ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కలిగించి నిధులు కేటాయించడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్ రాముడు, సమితి సభ్యులు నాగేశ్వరరావు, పిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



మల్లికార్జునరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుల సమక్షంలో స్థానిక 12వ డివిజన్ యువ నాయకుడు యెర్రు మల్లికార్జునరెడ్డి శనివారం బీజేపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పనతల సురేష్, మిట్ట ప్రసాద్ పార్టీ కండువా వేసి మల్లికార్జునరెడ్డిని సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 ఖోఖో పోటీలలో ఏపీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే చంద్రకళ, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.అనిలా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.